# కథకుడి కష్టాలు

మునిమాణిక్యం నరసింహారావు గారు, బి.ఎ., యల్.టి.

"శాస్త్రిగారూ మీరు ఆ భవభూతినీ కాళిదాసునూ చదివిందే చదివిందే ఎన్నిసార్లు చదువుతారండీ? ఆధునికవాఙ్మయం చూడరేం వాఙ్మయ ప్రవాహం వర్తమానకాలంలో చిత్రగతులలో ప్రవహిస్తున్నది. అదిగమనించరేం"

"అల్లాగా ఏమిటోయి ఆధునికవాఙ్మయంలో ఉండే చిత్రవిషయము"

"నూతనత్వము"

"నూతనత్వమా? అంటే?"

"అంటే ఏమిటో మీకొకమాటలో చెప్పటం కష్టం. ఉన్న విషయం ఏమిటంటే భాష విషయంలోను భావం విషయంలోను మార్పు వస్తున్నది. నూతనత్వం బయలుదేరుతున్నది. ఆధునికవాఙ్మయము నూతనత్వంతోడి కళకళలాడుతూ జీవకళలతో పొంగిపోతున్నది. త్రుప్పుపట్టిన ప్రాచీనవిషయాలను వదిలేస్తున్నాం."

"వదిలేస్తున్నాం అని అంఘావు. నీవు గూడా కవి అయినావా?"

"కవిని గాదు లెండి. అదే మోస్తరు. పత్రికలకు వ్యాసాలు, కథలు వ్రాస్తున్నాను."

అవును, భారతి అనే పత్రికచూచాను.

"అదేనండి అట్టి పత్రికలలోనే నేనూ వ్రాస్తుంటాను.

అయితే అబ్బాయి నీవు వ్రాసిన కథ ఒకటి వినిపించు చూస్తాను"

"శాస్త్రిగారూ, ఇప్పటి కాలంలో బొడ్డూడని ప్రతివాడూ కథ వ్రాయటం మొదలుపెట్టాడు. కాని నిజమైన కథ వ్రాయటం చాలాకష్టం సుమండీ."

"ఏమిటోయి కష్టాలు?"

"అడిగారు కాబట్టి చెబుతాను. నేనే ఉన్నాననుకోండి. ఒక కథ వ్రాయాలంటే ఎన్నో విషయములు ఆలోచించాలి. వ్రాయటంలో ప్రాచీన పద్ధతులను వదలివేసి నూతన విషయాలను చొప్పించాలి. పురాణయుగంలో "అనంగ అనంగ ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కుమాళ్లు, వారందరు ఒకరోజు వేటకెళ్లారు. ఒక అడవిలో వారికి అతి చక్కని సుందరి కనుపించింది" అని వ్రాయటం ఆచారం, కొంత కాలమైనతరువాత పూటకూళ్ల పేదరాలు కథలలో ప్రవేశించింది. ఎవరో ఒకడు ఆమె ఇంటికి వచ్చి "పెద్దమ్మా పెద్దమ్మా ఈ వూళ్లో విశేషాలు ఏమి అని అడగటం ఆమె ఆ వూరి రాజుగారి కూతుర్ని గురించిచెప్పటం" అట్లాకథ నడపటం ఆచారం అయింది. పూటకూళ్లపెద్దమ్మ కథకంతా సూత్రంగా ఉండేది. ఇప్పటి కాలంలో అల్లా కథ ఆరంభిస్తే నవ్వుతారు."

"ఎందుచేతనోయి?"

"అందులో నూతనత్వం ఏది. మాటవరుసకు చూడండి పూర్వము కృష్ణుని గానాన్ని గురించి మురళీగానం అనేవాళ్లు, కొంతకాలమైన తరువాత వేణుగానం అన్నారు. ఇప్పుడు అల్లా అంటె అంతా నవ్విపోరూ?

"మరి ఏమనాలోయి?"

"బొంగువాయిద్యం అనాలండి. ఇల్లా అనడంవల్ల అర్థం చెడకుండా సౌలభ్యం, మాధుర్యం నూతనత్వం కుదిరినవి."

"అల్లాగా. ఇప్పుడు కొంచెం అర్థం అయింది నూతనత్వం అంటె ఏమిటో. ఇది వదిలేసి నీ కథ విషయం ఏదో చెబుతానన్నావు చెప్పవూ?"

"ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే కథ నూతన ఫక్కీలో ప్రారంభించాలని. నేను ఆ విషయాలన్ని ఆలోచించి తూచి చివరకు ఇట్లా కథ మొదలుపెట్టాను. [ఆమె మొదట ఆయనను మామిడిచెట్టుక్రింద నుంచుని చూసింది.]

"ఆగవోయి. ఇదేమిటోయి ఎవరు ఆమె? ఆమె పేరేమి? ఏవూరు ఆమెది? ఇవన్నీ చెప్పకుండా నామరూపాలు లేకుండా కథారంభం ఏమిటి?"

"చూశారా మీరు అడిగిన ప్రశ్నలన్నీ వస్తవి. వాటికి జబాబు కోసం పాఠకులు కథను కొసా చదువుతారు. ఆ విధంగా కథ పూర్తిగా చదువవలెననే ఉత్సాహం పుట్టిస్తున్నాను. కథారచనా చమత్కృతులలో ఇది యొకటి. అయితే నా కథానాయికకు ఏమి పేరు పెడదామని మహాబాధపడ్డాను. ఆధునిక కథకులలో వేలూరు శివరామశాస్త్రి గారు వ్యక్తులను పేర్లు పెట్టటంలో అసమానప్రజ్ఞ సంపాదించారు. ఎవరూ వినని పేరు ఒకటి ఆయన సృష్టించగలడు.

నేను అటువంటి పేరు ఒకటి అడిగి పుచ్చుకొందామనుకొన్నా గాని మళ్లీ ఇంకో ఆలోచన వచ్చి మానేశాను. నాయకికి సావిత్రి అనే పేరు పెట్టాను."

"సావిత్రి. పాత పేరేనే. నూతనత్వం ఏది?"

"పేరు పాతదైతే నేమండీ, పాతపేళ్లే పెట్టి వాళ్లకు కొత్త వ్యక్తిత్వము కల్పించటంలో ఉన్నది. Old wine put in new bottles అనే సిద్ధాంతాన్ని ఆచరణలోకి పెట్టాను."

"బాగుంది. కథపేరు గూడా సావిత్రి అనే పెట్టినావా?"

"ఎబ్బే! అల్లా పెట్టలేదండీ. కథకు ఇంకా నామకరణం చేయలేదు. ఆ విషయంలో శివుడుగారిని అడగాలె. ఆయనదగ్గర కొఱవి దయ్యము, దొరసాని దుఃఖము, దయ్యాల కొంప, అనే చక్కని పేళ్లు కొన్ని ఉన్నవి. అందులో ఒకపేరు అడిగి పుచ్చుకొంటా. ఏదో విధంగా ఆ గండం గడుస్తుంది. కాని కథావస్తువు విషయమే చెడ్డకష్టం వస్తుంది."

"ఏమిటి కష్టమోయి?"

"అదే కష్టమండి శాస్త్రిగారూ. నే పడ్డ కష్టాలు చూడండి! కథావస్తువుగా దేనిని గ్రహించాలా అని. ఒక వెధవముండ పెండ్లి తీసుకొందామని ఒక ఆలోచన వచ్చింది."

"ఛీ అదేమిటోయి. వెధవముండ పెండ్లి కథావస్తువ."

"మీకు కష్టంగా ఉందా. వెధవముండ పెండ్లి అయినా దీర్ఘసుమంగళీభవ అని పేరు పెడితో ఆదోషం పోతుంది. ఒకాయన కుమారుడికి నాగడు అని పేరు పెట్టాడట. అందరూ ఛీవాట్లు వేశారు ఆయనని. ఇదేంపేరు వెధవ పేరు వాడు రేపు స్కూలుకు వెడితే అంతా నవ్వరా అని. అప్పుడొకాయన గ్రాపింగు పెట్టండి ఆ పాతపేరు పెట్టిన దోషం పోతుంది అన్నాడట. అల్లాగే వెధవముండ పెండ్లి కథావస్తువుగా గ్రహించినా పేరు పెట్టటంలో ఆ దోషం పోగొట్టవచ్చు. కాని అదొకటి దొరుకుతున్నది!"

"అదేమిటి అల్లా అంటావు పెండ్లిచేయటానికి వెధవముండ దొరకలేదు?"

"సరే. ఏ వెధవముండను తీసికొని ఇంత ఇంటిదాన్ని చేసి చేరెడు పసుపూ, చేరెడు కుంకుమా, ఒక చీరా ఇద్దామా అని పరకాయించి చూస్తే ఎవ్వరు కనిపించలేదు. ఎందుచేత ననగా వెధవముండలందరికి శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగారు కొద్దిరోజుల క్రిందనే వివాహం చేశారు. ఇంక ఒక్కతే మిగిలింది. ఆ ఒక్క ఆమ్మాయికి మొన్ననే సుమంగళీభవ అని వివాహం జరిగింది."

"పోనీ మొగాళ్ల వివాహం చేయరాదు"

"పోనీ మొగాళ్లకు ఎవరికైనా వివాహం చేసి కథ నడుపుదామా అంటే మా భావ మరిదిపెండ్లి అయిపోయిందా! కలెక్టరుగారి అబ్బాయికి వివాహం అయింది, చింతలపూడి వారి సంభావన అయిపోయింది."

"అల్లాగా మళ్లీ వివాహం కథావస్తువుగా తీసుకుంటే నూతనత్వం పోతుందన్నమాట. ఆహా బోధపడ్డది. అప్పుడేమిచేశావు?"

"ఏం జేసేదండి. మనుష్యవర్గం మానేసి జంతువర్గంలోకి పోయినా. జంతువును తీసికొని వాటిచేత మాట్లాడించి కిప్లింగులాగ కథ నడుపుదామంటే గొప్ప యిబ్బంది వచ్చింది."

"నీ ఇబ్బందులన్ని విచిత్రంగా ఉన్నవి. ఇప్పుడు వచ్చిన ఇబ్బంది ఏమిటి?"

"చూడండి. ఉన్న జంతువులలోకల్లా కుక్కలూ, పిల్లులూ, తాలూకా గుమస్తాల లాగ కాస్త గౌరవంగా బతుకుతున్నవి. అయితే ఇందులో కుక్కలన్నీ శివుడుగారి దగ్గరున్నవి. పిల్లుల నన్నింటినీ చింతా దీక్షితులుగారు కాజేశారు. ఇక దున్నపోతూ గాడిదా మిగిలినవి."

"అవా నీ కథకు వస్తువు."

"ఏం జేసేది? నాకు విచారం వేసింది. పోని వాటిపైనే కథ వ్రాద్దామంటే అవీ అను

పించలేదు. గౌతమీచరిత్రలాగ ఒక గాడిద స్వీయచరిత్ర వ్రాద్దామంటే ఒక్క గాడిదైనా ఒక్క దున్నపోతైనా కనుపించందే! ఏమా చిత్రం అని పరకాయించి చూస్తే, స్కూలు మాస్టర్లు నిమిషనిమిషానికీ గాడిద, దున్న పోతూ అంటం వినిపించింది. ఇంక మన కెట్లా వస్తవి. అవి వాళ్ల సొత్తు. నిస్పృహ చెందాను. చూశారా శాస్త్రిగారూ నిజంగా మంచికథ వ్రాయాలంటే ఎన్ని కష్టాలున్నవో. ఇవన్నీ ఏం తెలుస్తయి ఇతరులకు. కథ వ్రాస్తే అది బాగుండలేదు, కథకు ఉండాలిసిన లక్షణాలు లేవు, టెక్నిక్ లేదు అని ఆక్షేపిస్తారు."

బోధ పడుతున్నదోయి. అపుడేమి చేశావు."

"పోని అని పక్షివర్గం లోకి వెళ్లానండి. ఏదైనా ఒక పక్షిని తీసికొని దాని చేత మాట్లాడించి నీతిపాఠం చెబుదామని"

"అయితే మరిచిపోయినా నీవు వ్రాసే కథలకు నీతి ఉంటుందా."

"అయ్యో ఉండేటట్టు చేస్తానండి. గుంటూరులో ఉండే భావనాచార్లుగారు లోకంలో ఉండే నీతులను అన్నీ క్రోడీకరించి సంక్షేపించి పది ముఖ్యనీతుల క్రింద తేల్చారు. నా కథకు అందులో ఏది తీసుకొన్నా సరిపోతుంది."

"సరే. సరే. పక్షులను మాట్లాడిద్దామనుకున్నావు. ఏమయింది"

"విన్నారా, సరే మంచి ఆలోచన వచ్చిందని ఇటు చూద్దును గదా ఒక్క పక్షి లేదు."

"ఏమయినవి?"

"కోయిలలు చిలుకలు పార్వతీశకవుల దగ్గరున్నవి. ఇంకేముంది. ఇక గుడ్లగూబ మిగిలింది. దాన్ని చూస్తేనే నాకు భయం. అయినా తప్పనిసరి గదా దాని దగ్గరకు పోదునుగదా అది దేవులపల్లి వారి సంస్థానంలో ఆస్థాన కవిగా ప్రవేశించిందట. ఇక నాతో అది మాట్లాడుతుందా."

"చివరకు ఏమీ తోచక ఆంగ్లకవిలాగ చీపురుకట్ట పైన కథ వ్రాద్దామనుకొనేసరికి గురిజాడ అప్పారావుగారి పూటకూళ్లమ్మ వెంటబడ్డది చూశారా శాస్త్రిగారూ కథకుడి కష్టాలు ఇవి ఎవ్వరు గమనించరు. ఇంకేమి వ్రాసేది చెప్పండి. గంగిరెద్దు మీద వ్రాద్దే మంటే అడివి బాపిరాజుగారికి కోపం వస్తుంది. చిమ్మట మీద వ్రాద్దామంటే వేదుల ఆయనకు కోపమాయె?

"అప్పుడేమి చేశావు. గొప్ప అవస్థే."

"నూతనత్వంకోసం పడ్డ పాట్లండి ఇవి. అప్పుడు తీవ్రంగా ఆలోచించగా ఆలోచించగా ఒక్క విషయం తట్టింది. అపు డొక క్రొత్తవ్యక్తిని సృష్టించినాను."

"అంటే పైన చెప్పిన స్త్రీ కాకుండా, వెధవ ముండ కాకుండా, కుక్క కాకుండా, ఉండే ఒక నూతన వ్యక్తి అన్నమాట"

సరిగ్గా అంతే. అది యొక వ్యక్తి. అది చూపులకు మనిషే. కాని మనిషి కాదు. దున్నపోతుగాదు. గుడ్లగూబ కాదు. కోతి కాదు.

పిల్లికాదు. కుక్క కాదు. వెధవముండ కాదు. అయితే గుడ్లు గూబవి. ముఖం కోతిది. బుద్ధి కుక్కది. ఎక్కింది దున్నపోతు. చూపులు పిల్లివి. ఇటువంటి వ్యక్తి ఎవరు చెప్పండి?"

"దున్నపోతు ఎక్కాడు అన్నావు కాబట్టి యముడు అనాలిసొచ్చింది. అయితే యముడు మళ్లీ పాతవస్తువేనే?"

"అయితేనేం. యముడిని ఎవరైనా ఇటువంటి వ్యక్తి అని చెప్పారా. ధర్మరాజు అన్నారుకాని కుక్కబుద్ధి కలవాడు అన్నారూ? చూశారా వ్యక్తిత్వంలో నూతనత్వం. ఇందాక తమకు మనవి చేసేనా లేదా? పాతసారాయి క్రొత్తసీసాలలో పోయటం అనే సిద్ధాంతాన్నే మనస్సులో నుంచుకొన్నానని. అదండి ఇది."

"సరి సరి చాలా కష్టించారు."

"అయితే ఇప్పు డెంతవర కయింది? నాయిక పేరు కుదిరింది. నాయకుడు యముడు. ఇక ఏభాషలో వ్రాద్దామా అన్న శంక పట్టుకొంది. గొప్పకవులు ఏభాషలో వ్రాశారూ? ఎవరు గొప్ప కవులు అని మళ్లీ ప్రశ్న. నన్నయభట్టాది కవులు. నిజమే కాని వాళ్లు పాత బడ్డారు. ఆధునికకవులలో ఒకరు వాడుక భాషలో వ్రాయాలన్నారు. శ్రీపాదవారు గ్రాంథికంలో పుస్తకాలు వ్రాయాలన్నారు. వాళ్లేదో కొట్టుకొన్నారు. నాకెందుకు ఆసంగతి. మొత్తముమీద చాలమంది వాడుకభాషలో వ్రాస్తున్నారు. అయితే ఇంతటితో కష్టాలు గట్టెక్కలేదు. గిడుగు పంతులుగారు అరసున్నాలు లేకుండా వ్రాయమన్నారు. అసలు సున్నాలు లేకుండా వ్రాయమంటారు ఉమాకాన్తముగారు. ఈ ఉమాకాన్తముగారు—(ఉమాపతీ మందులు కనిపెట్టింది ఈయన యేమో నాకు తెలియదు.) ఈ మధ్య కొన్ని పుస్తకాలు వ్రాసి అందులో సున్నాలు పెట్టి వ్రాయడం మూలానే నన్నయభట్టు దగ్గరనుంచి నానాసాహేబువరకు కవిత్వం చెడిపోయిందనీ, అంతకు ముందు సున్నాలు లేకుండా ఉండి కవిత్వం సలక్షణంగా ఉందని వ్రాశారని ఎవరో అనుకొన్నారు. కృష్ణశాస్త్రిగారి కవిత్వం నిండా సున్నాలే అసలు ఆయన కవిత్వానికి అధిష్టానదేవత సున్నా అని వీరు సిద్ధాంతం చేశారట. వారిమతం అది. రెండు కలిపి కాస్త గ్రాంథికం కాస్త గ్రామ్యం కలిపి వేపపువ్వు పచ్చడిలాగ భాష తయ్యారైతే వంటికి మంచిది. దేశానికీ మంచిది. పైత్యపు ప్రేలాపనలన్నీ పోతయి అని మల్లాది సూర్యనారాయణగారు వాదిస్తారు. ఉచ్చారణను ఆధారణను చేసుకొని వ్రాయాలని అతివాదులు, భాషలో శబ్దరూపాన్ని పాడుచేయకుండా ఉండాలని మితవాదులు అంటున్నారు. నే నిందులో ఏ మతాన్ని అవలంబించినా నా వ్యక్తిత్వానికి లోపం వస్తుంది. నూతనత్వానికి భంగంకలుగుతుంది. అందుచేత నేను గూడా ఒకరకం భాష తయారు చేశాను. నేనంటం ఏమిటంటే ఏదో పూర్వంనుంచి వస్తున్న అరసున్నాలు బొత్తుగా తీసివేయక, పూర్వంనుంచీ శబ్దానుశాసనాన్ని అనుసరించి అరసున్న వేసేచోట

వేయకపోవటం, వేయనక్కరలేనిచోట వేయటము"

"అయ్యో. అదేమిటోయి, భాషను పాడు చేయటమే"

"పాడుచేయటం యేమిటి. భాషకు క్రొత్త క్రొత్త అలంకారా లిస్తున్నాము. దానికి నూతనత్వం కూరుస్తున్నాము ఏమంటారు"

"ఏమిటనేది, మీ చిత్తం."

"శాస్త్రిగారూ, ఈ విధంగా, పేరు, వస్తుపురసం, భాష మొదలైనవి ఇల్లా ఉండాలని నిర్ణయించి అప్పుడు కథ వ్రాయాలి చూశారా ఎంత కష్టం ఉందో!"

"చాలా కష్టమండీ—నాకు ఇప్పుడిప్పుడు తెలుస్తున్నది మీ నూతనత్వ తత్వము-ఇంతకూ మీకథ ఏమైంది? సావిత్రి కథ ఎట్లానడిపారు పాత కథ చెప్పారా?"

"శాస్త్రిగారూ నేను మొదటే మనవిచేసుకొన్నా పాత విషయములకే క్రొత్తరంగులు వేస్తున్నానని. కథ మట్టుకు పూర్వపుకథే కాని, ఈ క్రొత్తభాష, ఈక్రొత్తభావాలు, ఈ నూతనత్వం. ఆ కథకు అమర్చేటప్పటికి బహు హృద్యంగా ఉంటుంది కథ చదివి వినిపించనా?"

"ఇప్పటికే చాల కాలహరణము అయిపోయింది వినటానికి ఓపిక లేదు. ఆ కథలో ఉండే నూతన విషయము లేమిటో మాత్రం చెప్పండి."

"అట్టేలేవు మొదటివిషయం సావిత్రి భర్త ఫలాని పేరు గలవాడని కథలో ఎక్కడా చెప్పకపోవటం."

"ఎందుచేతనూ—వాడికి పేరుందిగా"

"వెధవ. వాడికి ప్రాముఖ్యము ఏముంది కథలో. సావిత్రి మొగుడనే వాడికి పేరు. మన వూళ్ళో ఆయనను వెంకమ్మ మొగుడు అని చెప్పుకొంటారే అదేమోస్తరు! వాడు అనామధేయుడు."

"సరే ఇదోగొప్ప విషయమే. ఇంకేమున్నది."

"మిగతావన్నీ సామాన్య విషయములే అదోరంగుతో కనబడుతవి. సావిత్రీ సావిత్రిమొగుడు అడవికి వెడతారు. మొగుడు చస్తాడు. యముడు ప్రాణాలు హరించి మోటారుకారు మీద వెళ్ళిపోతాడు. సావిత్రి ఇంకో కారులో వెంటబడుతుంది. యముడు కారు మెల్లగా పోనిస్తాడు. ఆయన దృష్టి సావిత్రిమీద పడుతుంది. కొంచెం సంచలనం కలుగుతుంది. ఇంక కొంచెం సేపు చూసేసరికి మోహములోకి పరిణమిస్తుంది ఆవికారము. సావిత్రి అంత చక్కదనాన్ని చూస్తే "బ్రహ్మదేవునికైన పుట్టు రిమ్మతెగులు" అని ఉంది. మరి యముడి మాట చెప్పనక్కఱలేదు. వికారపుచూపులు చూస్తాడు మెల్లగా పలుకరించి ఏమి కావాలె అంటాడు. నా విభుని ప్రాణములు ఇయ్యమంటుంది. యముడు సావిత్రియొక్క ఆలింగనం కోరతాడు. సావిత్రి నిర్ఘాంతపోయి ధర్మోపదేశం చేస్తుంది.

అంతటితో నాలుగో ప్రకరణం పూర్తిఅవుతుంది.

ఆరో ప్రకరణంలో వైతరణి దాటుతారు. ఏడో ప్రకరణంలో మళ్లీ అడుగుతుంది సావిత్రి తన విభుని ప్రాణాల నియ్యమని. యముడు మళ్లీ అయిదు నిమిషములు సావిత్రియొక్క భౌతిక శరీరం తనవశం చేయమంటాడు.

ఎనిమిదో ప్రకరణంలో భౌతికశరీరానికి ఆత్మకుగల సంబంధం చర్చకొస్తుంది.

• సావిత్రికి ఒక్కటేకోరిక. అదేమిా భర్త యొక్క ప్రాణములను తెచ్చుకొనుట.

ఆమెకు భర్తయందు అపారమైన ప్రేమ. ఆమెప్రేమ ఎంత పవిత్రమైనదో ఎంత అగాధమైనదో ఎవ్వరు చెప్పలేరు. మహాపతివ్రత. ఆలోచించి సావిత్రి భర్తృప్రాణములకొఱకు, ఆయనమిాదఉండే ప్రేమచేత తనభౌతిక శరీరాన్ని యముని కఠిన బాహువులలో పడేసి అయిదునిమిషములు ఆ సుకుమార శరీరాన్ని ఆ సురునివశం చేస్తుంది. యముడు సావిత్రితో సంభోగించి ఆమె పతిభక్తికి మెచ్చి ప్రాణాలు ఇచ్చేస్తాడు.

ఆ మహాపతివ్రత చేసిన పని తప్పులేదని భర్తయందు గల ప్రేమ అద్వితీయమని, భర్తృప్రాణరక్షణార్థమై ఆమె అమానుషమైన మాన త్యాగము నొనరించినదనీ సురాసురలు ఆనందించారు. నీచ మానవులు ఏమంటే లెక్కేమిటి. దేవదుందుభులు మ్రోగినయి అని వ్రాసి పూర్తిచేశాను"

"అయ్యో అయ్యో. నాచెవులలో సీసం కరిగించి పోసినా నా కింత బాధ పుట్టదోయి. ఇదేమిఅన్యాయమోయి సావిత్రిని దొమ్మరి ముండను చేశావు. అప్రాచ్యుడా."

"శాస్త్రిగారూ. అంటే భయపడపోకండి. నూతనంగా ఉందంటారా? లేదంటారా?"

"ఒరి నీ నూతనత్వం తగలెయ్య! నేను పోతా. ఈ మాటలు నా చెవులకు సోకనియ్యకు.'